
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం : 31 : జూలై : 2024





**సోమశిలలో 9.521 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 9.521 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.70,740 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.6,319 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.6,509 |
| నవర (8 గ్రాములు) | రూ.52,072 |

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
36.6 /26.5

గాలిలో తేమ 55 శాతంగా మంగళవారం నమోదైంది. బుధవారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఫోర్జరీ కేసులో కీలక నిందితుడు శివకృష్ణను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరపాలక సంస్థ గత కమిషనర్లు హరిత, వికాస్‌మర్మత్ సంతకాల ఫోర్జరీ విషయంలో నాటి కమిషనర్ వికాస్‌మర్మత్ ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు మేయర్ భర్త జయవర్ధన్, ఆయన వ్యక్తిగత సహాయకుడు శివకృష్ణతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసిన విషయం విదితమే. ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. పరారీలో ఉన్న శివకృష్ణను సాంకేతికత ఆధారంగా గుర్తించి మంగళవారం అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

### విద్యార్థి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



విద్యార్థి కుటుంబానికి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

నెల్లూరు (టౌన్): నగరంలోని కేఎన్నార్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సన్‌షేడ్ కూలి మృతిచెందిన గురు మహేంద్ర కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. మంగళవారం ఇస్కాన్‌సిటీలోని విద్యార్థి నివాసానికి వెళ్లిన నగర కమిషనర్ సూర్యతేజ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5 లక్షల చెక్కును విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి ఇంటి స్థలం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

### హెచ్‌టీ వినియోగదారుల సమావేశం 3న

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశం ఆగస్ట్ 3న నిర్వహించనున్నట్లు ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం విద్యుత్ భవన్‌లోని స్కాడాభవన కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో హెచ్‌టీ వినియోగదారులు వారి విద్యుత్ బిల్లులపై, సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు.

### దేవదాయ శాఖలో ఐదుగురు ఈఓల సస్పెన్షన్

- అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ చర్యలు

నెల్లూరు (బృందావనం): జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో వివిధ ప్రాంతాల్లో వివిధ దేవస్థానాల్లో విధులు నిర్వహిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఐదుగురు దేవస్థాన కార్యనిర్వహణాధికారులను దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానంలో సుమారు రూ.8 కోట్ల మేర నిబంధనలకు విరుద్ధంగా జరిగిన వ్యవహారాలకు సంబంధించి ఆ దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారులుగా విధులు నిర్వహించిన డి.వెంకటేశ్వర్లు, వి.గిరికృష్ణను సస్పెండ్ చేశారు. అలాగే వింజమూరు మండలం నల్లగొండ్లలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పునఃనిర్మాణంలో అవకతవకలకు పాల్పడ్డారన్న కారణంగా అక్కడ విధులు నిర్వహించిన, ప్రస్తుతం నెల్లూరులోని శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉన్న బొగ్గల మల్లికార్జునరెడ్డిపై వేటు పడింది. అలాగే ఉలవపాడు పరిధిలోని శ్రీనీలకంఠేశ్వర స్వామి దేవస్థానం భూమికి సంబంధించి గ్రావెల్ లీజు పర్మిషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారన్న కారణంగా గతంలో పనిచేసిన కార్యనిర్వహణాధికారి జానకి, అలాగే ప్రస్తుతం అక్కడే కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న కుడారి పెంచలవరప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. ఇటీవల సాక్షి దినపత్రికలో దేవదాయ, ధర్మాదాయశాఖలో జరుగుతున్న కోట్లాది రూపాయల అవినీతి, అక్రమాలపై వరుస కథనాలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించి ఈ చర్యలు తీసుకున్నారు.

# రైలెక్కాలన్నా కష్టమాయె!



నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ప్రయాణికుల ఇబ్బందులు

అలసట లేకుండా ప్రయాణించవచ్చునుకుని రైలు ఎక్కే సాధారణ, మధ్యతరగతి ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. జనరల్ బోగీలు తక్కువగా ఉండటం, వాటిలో కిక్కిరిసిన ప్రయాణికులు, కూర్చునేందుకు బెత్తెడు జాగా లేకపోవడంతో నరకం చూస్తున్నారు. నెల్లూరు నుంచి చెన్నై, బెంగళూరు, కేరళ, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ వైపు వెళ్లే రైళ్లలో కాలుతీసి కాలు పెట్టేందుకు ఖాళీలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనికి తోడు ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల ప్రజలు నెల్లూరు మీదుగా చెన్నై, బెంగళూరుకు నిత్యం వెళ్తుండటంతో జిల్లా ప్రజలకు జనరల్ బోగీల్లో జాగా దొరకడం లేదు. రద్దీ తట్టుకోలేక అనేక మంది రిజర్వేషన్ల బోగీల్లోకి జొరబడటంతో అక్కడ రిజర్వేషన్ చేయించుకున్న వారితో ఘర్షణ పరిస్థితులు తలెత్తుతున్నాయి. మంగళవారం సాక్షి ప్రతినిధులు నెల్లూరు రైల్వే స్టేషన్‌ను విజిట్ చేయగా ప్రయాణికుల అవస్థలు కళ్లకు కట్టినట్టు కనిపించాయి.

### ప్రయాణికులున్నా తగినన్ని బోగీల్లేవు

- జనరల్ బోగీలు తగ్గించి.. ఏసీ బోగీలు పెంచారు
- నవజీవన్‌లో కాలుపెట్టేందుకూ చోటు లేదు
- బాత్‌రూంల వద్ద సైతం కిక్కిరిస్తున్న ప్రయాణికులు
- జనరల్ బోగీలు పెంచాలని ప్రయాణికుల డిమాండ్
- ఇప్పటికే బిట్రగుంట – చెన్నై మెము రైలు రద్దు
- అదనపు రైల్వే లైను పనుల పేరుతో అడపాదడపా విజయవాడ – గూడూరు ప్యాసింజర్ రద్దు



ప్రయాణికులతో రద్దీగా ఉన్న నెల్లూరు రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం

| | |
|---|---|
| నెల్లూరు మీదుగా నడిచే రైళ్లు | - 50 |
| రోజూ రాకపోకలు సాగించే వారి సంఖ్య | - 23,700 |
| నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో బోగీలు | - 20 |
| వాటిలో జనరల్ బోగీలు | - 2 |
| ఒక్కో జనరల్ బోగీకి సీట్లు | - 99 |
| ఒక్కోదానిలో ఎక్కే ప్రయాణికులు | - 200కు పైగా.. |

సాక్షి విజిట్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చెన్నై సెంట్రల్‌లో బయలుదేరే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ నెల్లూరుకు 12.46 గంటలకు రావాల్సి ఉండగా 1.00 గంటలకు వచ్చింది. అహ్మదాబాద్ వెళ్లే ఆ రైలులో 20 బోగీలున్నాయి. వాటిలో కేవలం 2 బోగీలు మాత్రమే జనరల్‌గా ఉన్నాయి. 12 రిజర్వేషన్ల బోగీలుగా, 6 ఏసీ బోగీలుగా ఉన్నాయి. ఒక్కో జనరల్ బోగీలో 99 మంది మాత్రమే ప్రయాణించేందుకు అనుకూలంగా సీట్లు ఉన్నాయి. అయితే ఒక్కో జనరల్ బోగీలో సుమారు 200 మందికి పైగా ప్రయాణిస్తున్నారు. చోటు దొరక్క కొంతమంది బాత్‌రూంల వద్ద సైతం రద్దీ వల్ల నిలబడిపోయారు. ఇలాంటి బోగీల్లో ముసలివారు, చిన్నపిల్లలు, స్త్రీలు ప్రయాణించాలంటే ఎలా సాధ్యమవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా బాత్‌రూంలలో నీరు కూడా సరిపడినంత లేదు. కొంత దూరం వెళ్లాక నీరు అయిపోయిందని ప్రయాణికులు పేర్కొన్నారు. ఇలాంటి చోట నుంచి వచ్చే కంపును సైతం ముక్కు మూసుకుని భరిస్తూ తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే పరిస్థితి జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లోనూ కనిపించింది. ఇలాగే పలు రైళ్లలో ఉంది.

**పలు రైళ్ల రద్దు.. రిజర్వేషన్ల బోగీల తగ్గింపు**

నెల్లూరు నుంచి నిత్యం 23,700 మంది ప్రయాణికులు రాను, పోను ప్రయాణిస్తున్నారు. పేదలు, మధ్య తరగతి ప్రయాణికుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. అయితే బోగీలను పెంచాల్సిన రైల్వేశాఖ సాధారణ బోగీలను తగ్గించింది. ఆ మేరకు ప్రతి ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు నుంచి మూడు బోగీలను ఏసీలుగా మార్చేసింది. అలాగే వందేభారత్ లాంటి సూపర్ ఫాస్ట్ రైళ్లను ప్రవేశపెడుతూ అధికరేట్లకు టికెట్లు అమ్ముతూ సాధారణ రైళ్లలో జనరల్ కోటాను తగ్గించడం అన్యాయమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నెల్లూరు నుంచి గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, తిరుపతిలకు వెళ్లే ఉద్యోగులు రోజూ 1000 మందికి పైగానే ఉన్నారు. జనరల్ బోగీలు నిండిపోవడంతో ప్రతి రోజు గంటల కొద్దీ రైళ్లలో నిలబడి పోను, రాను ప్రయాణిస్తున్నారు.

- ఇప్పటికే బిట్రగుంట, చెన్నై మెము రైలును రద్దు చేశారు. అడపాదడపా అదనపు రైల్వే లైను పేరుతో విజయవాడ-గూడూరు ట్రిప్‌ను అప్పుడప్పుడు రద్దు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనే అధిక రేటుకు టికెట్లు కొనుగోలు చేసి ప్రయాణిస్తున్నారు. ఇకనైనా జనరల్ బోగీలు పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

#### రిజర్వేషన్ దొరకాలంటే కష్టమే..

- పెరిగిన తత్కాల్ కోటా

హైదరాబాద్, విశాఖ లాంటి పట్టణాలకు వెళ్లాలంటే ప్రయాణికులు ఒకటిన్నర నెల ముందే రిజర్వేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే వెయిటింగ్ లిస్ట్‌లో ఉండాల్సిందే. రిజర్వేషన్ కోటా తగ్గించి తత్కాల్ కోటాను అధికారులు పెంచారు. ఆ తత్కాల్ కింద ఒక రోజు ముందైనా టికెట్లు కొనుగోలు చేద్దామంటే దొరకడం లేదు. తత్కాల్, ఏసీ టికెట్లు కొంతమేరకు అందుబాటులో ఉన్నా అధిక ధరలు ఉండటంతో ప్రయాణికులు విముఖత చూపుతున్నారు. ప్రజాసంక్షేమమే బాధ్యతగా భావించాల్సిన రైల్వే శాఖ నిరుపేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచేలా చార్జీల వడ్డన చేస్తోంది.



రైలు ఫుట్‌పాత్‌పై నిలబడిన ప్రయాణికులు

**నెల్లూరు మీదుగా..**

నెల్లూరులో స్టాపింగ్ ఉన్న వాటిలో 33 రోజువారీ రైళ్లు చెన్నై, బెంగళూరు, తిరుపతి వైపు ప్రయాణిస్తున్నాయి. మరో 17 వీక్లీ రైళ్లు కలిపి 50 రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఒకటో, రెండో పాసింజర్ రైళ్లు మినహా మిగతావన్నీ ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లే. సాధారణ ప్రజానీకం ప్రయాణించడానికి గతంలో రద్దు చేసిన బిట్రగుంట, చెన్నై మెము రైలును పునరుద్ధరించడంతో పాటు మరిన్ని ప్యాసింజర్ రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



జనరల్ బోగీలో నిలబడి ప్రయాణం





రద్దీగా ఉన్న నెల్లూరు రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం



చోటుచాలక బాత్‌రూం వద్ద కూర్చున్న మహిళ

#### జనరల్ బోగీలు పెంచాలి



కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జనరల్ బోగీలు పెంచాలి. యూనియన్ అవసరాల దృష్ట్యా తాను రాష్ట్రం అంతా తిరుగుతుంటాను. అత్యవసర మీటింగ్‌లుంటాయి. ఒక్కో దఫా ముందుగా రిజర్వేషన్ చేసుకోవడానికి కుదరదు. ప్రస్తుతం కూడా నేను నెల్లూరు నుంచి ఒంగోలు వెళ్తున్నాను. జనరల్ బోగీలో ఎక్కాలంటే తిప్పలు తప్పలేదు. కూర్చోవడానికి సీటు కాదు కదా నిలబడటానికి కూడా సరిగా స్థలం లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అందువల్ల ప్రభుత్వం ఇప్పటికైనా జనరల్ బోగీలు పెంచాలి. అవసరమైతే అదనపు బోగీలు వేయాలి.

– కె.రాజశేఖర్, ఎల్ఐసీ ఏఓఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

#### చాలారోజుల ముందే ప్లాన్ ఎలా సాధ్యం



హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ లాంటి పట్టణాలకు వెళ్లాలంటే నెల ముందే టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి. ఇలా చాలా రోజుల ముందే ప్లాన్ చేసుకోవాలంటే కష్టం. అప్పటికప్పుడు ప్రయాణాలు చేయాలంటే రైలు టికెట్లు దొరకడం లేదు. అందువల్ల అధిక ధరలతో బస్సుల్లో ప్రయాణిస్తున్నాం. రద్దీకి అనుగుణంగా అదనంగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఏర్పాటుతో పాటు జనరల్ బోగీల సంఖ్యను పెంచాలి.

– సెల్వరాజ్, ప్రయాణికుడు, నెల్లూరు

#### చెన్నై, తిరుపతికి మెము రైళ్లు నడపాలి



నెల్లూరు జిల్లాను విభజించాక వందలాది మంది ఉద్యోగులు తిరుపతి జిల్లాలో పని చేస్తున్నారు. వారంతా నెల్లూరు నుంచి సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట, తిరుపతిలో విధులకు వెళ్తున్నారు. తెల్లవారు జామున 4 గంటలకు బయలు దేరాల్సిన పరిస్థితి. లేదంటే రైళ్లు అందుబాటులో ఉండవు. అందువల్ల ఉద్యోగులకు, ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు చెన్నై, తిరుపతి వైపు మెము రైళ్లు నడపాలి. అలాగే రైళ్లలో కనీస వసతులు కల్పించాలి.

– చేజర్ల సుధాకర్‌రావు, హంస జిల్లా అధ్యక్షుడు

# గ్రావెల్‌కు 'ఎస్' ట్యాక్స్!

### సర్వేపల్లి నియోజకవర్గంలో పచ్చ మాఫియా బరితెగింపు

- జాతీయ రహదారి పక్కనే తవ్వకాలు
- రామదాసుకండ్రిగలో రేయింబవళ్లు దోపిడీ
- కన్నెత్తి చూడని అధికారులు

రామదాసుకండ్రిగలో గ్రావెల్ తవ్వకాలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల ముగిసిన మరుసటి రోజు నుంచి టీడీపీ నాయకులు సర్వేపల్లి నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీకి తెరలేపారు. ప్రస్తుతం సర్వేపల్లి షాడో ఎమ్మెల్యేగా చెలామణి అవుతున్న ఓ నేత కనుసన్నల్లో గ్రావెల్, మట్టి మాఫియా బరితెగించి తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, చివరకు జాతీయ రహదారి భూములను వదలకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. సహజ వనరుల దోపిడీని అడ్డుకోవాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం వందలాది సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో గ్రావెల్ తరలింపునకు అడ్డే లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహానికి గురవుతున్నారు.

సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని వెంకటాచలం మండలంలోని రామదాసుకండ్రిగ కేంద్రంగా గత వారం రోజుల నుంచి రేయింబవళ్లు టీడీపీ నేతలు ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ కొల్లగొడుతున్నారు. రామదాసుకండ్రిగ గ్రామానికి కృష్ణపట్నం పోర్టు రహదారికి మధ్యలో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటు కోసం 15 ఏళ్ల క్రితం 18 ఎకరాల భూములను ఏపీఐఐసీకి కేటాయించారు. ఆ భూములు ఖాళీగా ఉండటంతో టీడీపీ నేతల కన్ను వాటిపై పడింది. ఎర్ర నేల కావడంతో ఆ భూముల్లో వారం రోజుల నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లతో గ్రావెల్ తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. రెండు పొక్లెయిన్లతో నిత్యం టిప్పర్లు, ట్రాక్టర్లతో గ్రావెల్ రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పర్ గ్రావెల్ ధర రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పైగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం గ్రావెల్ ద్వారా రూ.5 లక్షల వరకు షాడో ఎమ్మెల్యేకు 'ఎస్' ట్యాక్స్ ద్వారా వసూలవుతోంది.

**హైవేను వదలని షాడో ఎమ్మెల్యే**

ప్రభుత్వ భూములను, చెరువులను చెరబట్టి గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్న టీడీపీ నేతలు చివరకు జాతీయ రహదారి భూములను వదిలి పెట్టడం లేదు. ఎర్రమట్టి ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోతూ ఆ భూముల స్థితిగతులతో పని లేకుండా తవ్వకాలు చేస్తున్నారు. వెంకటాచలం టోల్‌ప్లాజా– కృష్ణపట్నం పోర్టు రోడ్డు మధ్యలో పాత జాతీయ రహదారి భూమి ఉంది. ఈ భూమిలో ఎర్ర గ్రావెల్ ఉండటంతో టీడీపీ నేతలు రెండు రోజుల నుంచి ట్రాక్టర్ల ద్వారా రియల్ వెంచర్లకు తోలకాలు చేస్తున్నారు. వాటి యజమానులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4 వేలు వంతున చెల్లిస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేస్తున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మైనింగ్ అధికారులు ఫోన్ లిఫ్ట్ చేయడం మానుకున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు విషయంపై సోషల్ మీడియా గ్రూపుల్లో ఫొటోలు, వీడియోలు పెట్టి వైరల్ చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు.



గ్రావెల్ తీసుకెళ్లేందుకు వచ్చిన ట్రాక్టర్లు

#### గ్రామస్తులు అడ్డుకున్నా ఆగని తవ్వకాలు

గ్రామానికి సమీపాన ఉన్న ప్రభుత్వ భూముల్లో 20 అడుగులకు పైగా లోతుతో గ్రావెల్ తవ్వుతున్నారనే విషయం తెలియడంతో రెండు రోజుల క్రితం గ్రామస్తులంతా అక్కడకు చేరుకున్నారు. ఈ గుంతల్లో పడి మా గేదెలు, మేకలు మృతి చెందుతాయని తవ్వకాలు నిలిపివేయాలని గొడవకు దిగినా పట్టించుకోలేదు. మాకు అన్ని అనుమతులు ఉన్నాయని, అడ్డుకునే ప్రయత్నం చేస్తే కేసులు పెడతామని బెదిరించడంతో గ్రామస్తులు చేసేదేమీ లేక వెనుతిరిగి వచ్చేశారు. అధికారం చేతిలో ఉంటే పేదలకు మేలు చేయాలే గానీ, గ్రామస్తులను బెదిరించి అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపట్టడం ఏమిటని మండి పడుతున్నారు.

**జంకుతున్న మైనింగ్ అధికారులు**

సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయంలో అనుమతులు ఉన్నాయా? లేదా? తెలుసుకునేందుకు ఫోన్ ద్వారా సంప్రదించినా మైనింగ్ అధికారులు చెప్పేందుకు భయపడి పోతున్నారు. ఫోన్ తీసేందుకు కూడా ఇష్టపడటం లేదు. గ్రావెల్ అక్రమ రవాణాలో వారూ భాగస్వాములుగా ఉన్నారన్న ప్రచారం ఉంది.

### మహిళపై లైంగికదాడికి యత్నం

- బుచ్చిరెడ్డిపాళెంలో ఘటన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెంలో ఓ మహిళపై కామాంధుడు లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన మహిళ గత శనివారం ఇంటి నిర్మాణ పనులు చేయిస్తుండగా.. కల్యాణ్ అనే యువకుడు మద్యం మత్తులో ఆమెను దూషించాడు. కాస్త తెలిసిన వ్యక్తి కావడంతో.. ఈ విషయాన్ని అతని తల్లికి చెప్పేందుకు మహిళ ఆటోలో బయల్దేరింది. కల్యాణ్ కూడా వెంబడించి ఆటో ఎక్కాడు. దారిలో కసిరిపాళెం వద్ద ఆటో డ్రైవర్‌ను బెదిరించి.. ఆమెను సమీపంలోని ఓ ఇంట్లోకి లాక్కెళ్లాడు. లైంగికదాడికి ప్రయత్నించగా.. బాధితురాలు తప్పించుకుని అర్ధనగ్నంగా బయటకు పరుగులు తీసింది. వెంటనే ఈ విషయాన్ని కల్యాణ్ తల్లికి తెలియజేసింది. కల్యాణ్ తల్లి, బాధితురాలు కలిసి మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### 598 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 598 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 629 బేళ్లు రాగా వాటిలో 598 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 74,651 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,08,06,202 వ్యాపారం జరిగింది. గరిష్ఠ ధర కిలో ఒక్కింటికి రూ.358 కాగా కనిష్ఠ ధర రూ.205 లభించింది. సగటు ధర 278.71గా నమోదు అయింది. వేలంలో 21 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఆగస్టు ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్లను రెండు రోజుల్లోనే నూరు శాతం అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి నగదు పంపిణీని ప్రారంభించాలన్నారు. తొలిరోజే 99 శాతం అందించాలని ఆదేశాలిచ్చామని చెప్పారు.

• జిల్లాలో 3,11,535 మంది లబ్ధిదారులకు పింఛన్లు చెల్లించేందుకు రూ.131.68 కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### పశువుల వేలం నేడు
కొండాపురం: మండలంలోని చింతలదేవి పంచాయతీలో ఉన్న జాతీయ కామధేను సంతాన ఉత్పత్తి కేంద్రంలోని ఆవులు, పెయ్యలు, ఎద్దులకు వేలాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు సంయుక్త సంచాలకుడు వై.వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 182 దేశీయ జాతికి చెందిన పశువులను వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

### ఓపెన్ స్కూల్లో పది, ఇంటర్‌లో ప్రవేశాలు
• వచ్చేనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు(టౌన్): ఓపెన్ స్కూల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ఆసక్తి గల వారు వచ్చేనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఈఓ గ్లోరికుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్‌ను వ్యక్తిగతంగా లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రం లేదా గ్రామ, వార్డు సచివాలయంలో చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాల కోసం 90006 19699 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

### లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు
అల్లూరు: లారీ మోటార్‌బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన అల్లూరుపేట సత్రం నాలుగురోడ్ల సర్కిల్లో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. అల్లూరుపేట సత్రానికి చెందిన మేడా రమేష్‌రెడ్డి అల్లూరు నుంచి చింతగుంటకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇస్కపల్లి నుంచి ఉప్పులోడుతో అల్లూరు నుంచి కావలి వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొనడంతో రమేష్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. డ్రైవర్ మద్యం తాగి లారీని నడిపాడని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీని అల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి
వెంకటాచలం: మండలంలోని చవటపాళెం గ్రామానికి చెందిన ఓ వివాహిత చికిత్స పొందుతూ నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సోమవారం రాత్రి మృతిచెందింది. మంగళవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. చవటపాళెనికి చెందిన నాగేశ్వరి (22) మూడు రోజుల క్రితం తన ఇంట్లో విష గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం వెంటనే నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది.

• మండలంలోని ఈదగాలి గ్రామానికి చెందిన కొల్లు వెంకటరమణయ్య సోమవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతను నాలుగు రోజుల క్రితం విష గుళికలు మింగాడు. గ్రామస్తులు గుర్తించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

### కండలేరులో 6.145 టీఎంసీలు
రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.145 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 130, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### కీచకుడి అరెస్ట్
కావలి: ఓ బాలికపై ఇటీవల అఘాయిత్యానికి పాల్పడిన షేక్ మహబూబ్‌బాషా అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ మంగళవారం వెల్లడించారు.

### పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) : | 112 |
| లేయర్ (లైవ్) : | 95 |
| బ్రాయిలర్ చికెన్ : | 206 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ : | 230 |
| లేయర్ చికెన్ : | 162 |



### పొదలకూరు నిమ్మధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి : | రూ.65 |
| సన్నవి : | రూ.45 |
| పండ్లు : | రూ.30 |



# మా బావ ఎమ్మెల్యే.. అంతా నా ఇష్టం

## మండలంలో పెత్తనం చేస్తున్న శాసనసభ్యుడి బంధువు



'అందరూ వినండి. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నాకు బావ వరుస అవుతాడు. నేను చెబితే ఆయన చెప్పినట్లే' ఇదీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో ఓ వ్యక్తి ధోరణి. వలేటివారిపాళెం మండలానికి చెందిన ఈయన ప్రస్తుతం ఉలవపాడు మండలంలో పెత్తనం చేస్తున్నాడు. సీనియర్ నాయకులు సైతం తన వద్దకు రావాల్సిందే అంటున్నాడు. ప్రస్తుతం మండలంలో సర్వాధికారం నాదేనని చెబుతున్నాడు.

• డీలర్లు, వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులు ఆయన చేతుల్లోనే..
• ఆగ్రహంగా ఉన్న స్థానిక సీనియర్ నేతలు

ఉలవపాడు: 'నేను చెప్పిన వారే రేషన్ డీలర్. నాకు నచ్చిన వారే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉంటారు. నేను చూపించిన వారే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ)గా పనిచేస్తారు. నేను చెప్పినట్లే అధికారులంతా నడుచుకోవాలి.' ఇదీ పొడపాటి సుధాకర్ అనే వ్యక్తి ఉలవపాడు మండలంలో చేస్తున్న పని. వలేటివారిపాళెం మండలానికి చెందిన ఈయన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు సమీప బంధువు, బావమరిది వరుస అవుతాడు. ఎన్నికల సమయంలో సుధాకర్ ఇంటూరి కోసం ఉలవపాడు మండలంలో పనిచేశాడు. దీంతో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతిఫలంగా ఇక్కడ ఇష్టమొచ్చినట్లు చేసుకోమని సుధాకర్‌కు నాగేశ్వరరావు బాధ్యతలు అప్పజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు ఏ పనిచేయాలన్నా, ప్రజలకు ఏ పని కావాలన్నా ఆయన్ను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

**తొలగింపులు.. నియామకాలు**

మండలంలో ప్రస్తుతం ఉన్న డీలర్లు, వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలను మార్చడానికి ఏకంగా పార్టీ కార్యాలయంలోనే సోమవారం సుధాకర్ సమావేశం ఏర్పాటు చేశాడు. ఎమ్మెల్యే అండతోనే ఇలా చేసినట్లు కొందరు నేతలు భావిస్తున్నారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్‌షిప్, భోజన ఏజెన్సీలు తమకే కావాలంటూ కార్యకర్తలు పట్టుబట్టారు. ఇప్పుడున్న వారిని తొలగించి కొత్తవారిని నియమించాలని తహసీల్దార్ కార్యాలయానికి పేర్లు పంపించినట్లు సమాచారం. ఈ విషయాలు సీనియర్ నాయకులకు మింగుడు పడడంలేదు. సుధాకర్ వ్యవహారశైలి నచ్చక సమావేశానికి డుమ్మా కొట్టారు. గతంలో పోతుల రామారావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూడా ఇలానే పలువురు అధికారం చెలాయించారు.

### ఆగ్రహంగా సీనియర్ నేతలు
ఎమ్మెల్యే ఆదేశాలతో వేరే మండలానికి చెందిన సుధాకర్ ఉలవపాడు మండలంలో పెత్తనం చెలాయించడాన్ని స్థానిక టీడీపీ సీనియర్ నేతలు అంగీకరించడం లేదు. ఈ వ్యవహారంపై గుర్రుగా ఉన్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి తాము ఎంతో శ్రమించామని, ఇప్పుడు మమ్మల్ని కాదని సుధాకర్‌కు బాధ్యతలు ఇవ్వడాన్ని వారు సహించలేకపోతున్నారు. తమ మాట చెల్లుబాటు కావడం లేదని, ఎమ్మెల్యే మండలాన్ని అతనికి రాసిచ్చినట్లు ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుధాకర్ చేస్తున్న పనులపై ద్వితీయ శ్రేణి నాయకులంతా అసంతృప్తిగా ఉన్నా ఇంటూరి మాత్రం చూసీచూడనట్లు ఉన్నట్లు విమర్శలున్నాయి. అతను ఏం చేసినా ఫర్వాలేదన్నట్లుగా ఎమ్మెల్యే వ్యవహారశైలి ఉందని పార్టీలో చర్చ నడుస్తోంది.

### శభాష్ మను భాకర్



మను అక్షరాల ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

సోమశిల: పారిస్ ఒలింపిక్స్‌లో రెండో కాంస్య పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించిన షూటర్ మను భాకర్‌కు అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్ టీచర్లు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో టీచర్లు జాతీయ పతాకాన్ని పట్టుకోగా.. విద్యార్థులు మను అక్షరాల ఆకారంలో కూర్చొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు, మదీనా, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# మనుబోలులో రెచ్చిపోయిన దొంగలు

• 14 గ్రాముల బంగారం, రూ.14 వేల నగదు చోరీ

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో సోమవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు కోదండరామపురం దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయ తలుపు తాళాలు పగులగొట్టారు. అమ్మవారికి అలంకరించి ఉన్న 6 గ్రాముల బంగారు తాళిబొట్టు, కాసులు, ఇంకా హుండీని తెరిచి నగదు దోచుకెళ్లారు. పక్కవీధిలో ఉన్న కోదండ రామాలయం తలుపులు తెరవగా అక్కడేమి లేకపోవడంతో సమీపంలోని సర్వభట్ల వెంకటశేషయ్య, జాలారి రాధయ్యల గృహాల వద్దకు వెళ్లారు. వాటికి తాళాలు వేసి యజమానులు వేరే ప్రాంతానికి వెళ్లి ఉన్నారు. దీంతో దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాల్లోని దుస్తులు, వస్తువులు కింద పడేశారు. నగలు, నగదు కనిపించకపోవడంతో గోపిరెడ్డి నిర్మలమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లారు. ఆమె కూడా ఊరికి వెళ్లి ఉన్నారు. దీంతో తాళాలు పగులగొట్టి 8 గ్రాముల బంగారం, రూ.14 వేల నగదు చోరీ చేశారు. మంగళవారం సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌కుమార్ ఆలయాలు, గృహాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. వరుస చోరీలతో మనుబోలులో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

# డ్రగ్స్ కట్టడికి పటిష్ట చర్యలు

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(క్రైమ్): 'డ్రగ్స్ కట్టడికి అన్ని శాఖలు చర్యలు పటిష్ట తీసుకోవాలి. అధికారులు సమన్వయంతో పనిచేయాలి' అని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ నెల్లూరులోని పోలీసు కార్యాలయం నుంచి నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ తన కార్యాలయం నుంచి ఇందులో పాల్గొని మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. భావితరాల భవిష్యత్‌పై వాటి ప్రభావం పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు పాఠశాల స్థాయి నుంచే వాటి వినియోగం వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన యువతకు డీ ఎడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి వారిలో పరివర్తన తీసుకొచ్చేలా చొరవ చూపాలన్నారు. ఆర్టీసీ, రైల్వే రవాణా వ్యవస్థ, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, నిషేధిత మత్తు పదార్థాల అమ్మకం, నిల్వ, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించాలన్నారు. గంజాయి సరఫరాదారులు, స్థానికంగా విక్రయించేవారు, సేవించేవారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం, మాదక ద్రవ్యాల సేవనం ద్వారా వచ్చే ఇబ్బందులపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎన్‌కార్డ్ కమిటీ స్టేక్ హోల్డర్స్ పలు సూచనలు, సలహాలిచ్చారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌ఈబీ ఈఎస్ బాబు శ్రీధర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పెంచలయ్య, కోస్ట్‌గార్డ్ కమాండెంట్, అగ్రికల్చర్ జేడీ, విద్యాశాఖ, ఆర్టీఓ, కృష్ణపట్నం పోర్టు సీఐఓ, ఇంటెలిజెన్స్, డీఎస్పీ, సీఐ, ఎస్‌ఈబీ అధికారులు పాల్గొన్నారు.

### యువకుడిపై దాడి
• ఆలస్యంగా వెలుగులోకి..
• సోషల్ మీడియాలో వీడియో వైరల్

అల్లూరు: యువకుడిపై దాడి చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరలైంది. మంగళవారం దాడికి గురైన యువకుడి కుటుంబసభ్యులు అల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. అల్లూరు సెటిల్‌మెంట్ కాలనీకి చెందిన ముగ్గురు స్నేహితులు ఒకే మోటార్ బైక్‌పై ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం రామతీర్థం వెళ్లారు. అక్కడ బీచ్‌లో మద్యం తాగి తిరిగి సొంతూరికి బయలుదేరారు. ఈ తరుణంలో బైక్ వేగంగా పోనిస్తున్నాడని ఆపేయాలని వెనుక కూర్చొన్న స్నేహితుడు కోరాడు. అయితే వాహనం ఆపకపోవడంతో వారి మధ్య వివాదం మొదలైంది. ఈ క్రమంలో బైక్ నడుపుతున్న వ్యక్తి అతడిని కొట్టాడు. దాడి చేస్తున్న దృశ్యాలు తాజాగా ఫేస్‌బుక్, వాట్సప్ తదితర చోట్ల వైరలయ్యాయి. బాధిత కుటుంబానికి విషయం తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

# బంగారు ఆభరణాలను కాజేసేందుకు..


• నకిలీవని బుకాయించిన వ్యాపారి
• పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

నెల్లూరు(క్రైమ్): కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు నకిలీవని బుకాయించి కాజేసిన కుదువ వ్యాపారిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన ఉషారాణి తన ఇద్దరు పిల్లలు, తల్లి భవానీతో కలిసి నెల్లూరు పడారుపల్లిలో నివాసం ఉంటోంది. ఆమె ప్రస్తుతం న్యాయవిద్యను అభ్యసిస్తోంది. తన 141.54 సవర్ల బంగారు ఆభరణాలను బాగా తెలిసిన నరసాపురంలోని ఓ బంగారు వ్యాపారి వద్ద కుదువపెట్టి రూ.47.40 లక్షలు తీసుకుంది. దానికి సంబంధించిన వడ్డీని ప్రతినెలా చెల్లిస్తూ వచ్చారు. ఇటీవల ఉషారాణి, భవానీ నర్సాపురం వెళ్లారు. తమకు నగదు అవసరమని తాకట్టులోని బంగారు ఆభరణాలను అమ్మేసి కుదువకు సంబంధించిన నగదు తీసుకుని మిగిలింది ఇవ్వాలని వ్యాపారిని కోరారు. తాకట్టులో ఉన్న ఆభరణాలు నకిలీవని, మీరే నగదు కట్టాలని వ్యాపారి వారికి చెప్పాడు. దీంతో కంగుతిన్న బాధితులు అతడిని నిలదీయగా వారిని అసభ్యకర పదజాలంతో దూషించడమే కాకుండా చంపుతానని బెదిరించాడు. దీంతో దిక్కుతోచని బాధితురాలు రెండురోజుల క్రితం నెల్లూరులోని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆభరణాలను కాజేసేందుకు నకిలీవని చెప్పిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. అయితే ఘటన జరిగిన ప్రదేశం నరసాపురం కావడంతో తదుపరి విచారణ నిమిత్తం కేసును అక్కడి పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేయనున్నట్లు సమాచారం.

# క్లిక్ చేశారో.. డబ్బు హుష్‌కాకి

• బిల్లులు చెల్లించాలని ఎస్‌ఎంఎస్‌లు పంపుతున్న సైబర్ నేరగాళ్లు
• అందులోని లింక్‌ను తెరిస్తే అంతే సంగతి
• డబ్బు కొట్టేస్తున్న ముఠాలు
• అప్రమత్తంగా ఉండాలంటున్న విద్యుత్ అధికారులు

జిల్లాలో..
విద్యుత్ సర్వీసులు : సుమారు 13 లక్షలు (అన్ని రకాలు)




విద్యుత్ వినియోగదారులకు సైబర్ నేరగాళ్లు పంపిన ఎస్‌ఎంఎస్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'మీరు విద్యుత్ బిల్లు చెల్లించలేదు. తక్షణమే కట్టాలి. లేనిపక్షంలో మీ కనెక్షన్ కట్ చేస్తాం. మీ ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ పంపుతున్నాం. అందులోని లింక్‌పై క్లిక్ చేసి నగదు చెల్లించండి' ఇలా సైబర్ నేరగాళ్లు విద్యుత్ వినియోగదారులకు ఎస్‌ఎంఎస్ చేస్తున్నారు. పొరపాటున ఆ లింక్‌ను ఓపెన్ చేస్తే బ్యాంక్ అకౌంట్‌లోని నగదు మొత్తం హుష్ కాకి అవుతుంది. ఇప్పటికే కొందరు మోసపోయి బాధపడుతున్నారు.

**అదే పనిగా..**

సైబర్ నేరగాళ్లు డబ్బు కాజేసేందుకు రోజుకో కొత్త దారి వెతుకుతున్నారు. తాజాగా విద్యుత్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకున్నారు. వీరు మొదట వినియోగదారుడిని ఎంచుకుని వారి ఫోన్ నంబర్‌కు మెసేజ్ పంపుతారు. అందులో మీరు విద్యుత్ బిల్లు చెల్లించాల్సి ఉంది. వెంటనే కట్టేయండి. లేకపోతే సర్వీస్ కనెక్షన్ కట్ చేస్తాం. ఏమైనా సందేహాలుంటే విద్యుత్ శాఖ అధికారికి ఫోన్ చేయాలంటూ ఒక నంబర్ ఇస్తున్నారు. రాత్రి సమయాల్లోనే అధికంగా ఎస్‌ఎంఎస్ పంపడం జరుగుతోంది. పక్కరోజు ఉదయం దానిని చూసి వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. కట్టనివారితోపాటు, చెల్లించిన వారు కూడా కొంత ఆందోళనకు గురై వెంటనే ఎస్‌ఎంఎస్‌లో విద్యుత్ అధికారి పేరుతో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయడం జరుగుతోంది. అవతల కాల్ లిఫ్ట్ చేసిన వ్యక్తి తాను విద్యుత్ శాఖ అధికారిగా పరిచయం చేసుకుని వెంటనే బిల్లు చెల్లించాలని లింక్ పంపుతాడు. దీని ద్వారా బిల్లు చెల్లిస్తే కనెక్షన్ కట్ చేయమని నమ్మిస్తాడు. అధికారి స్వయంగా మాట్లాడాడని భావించి చాలామంది వినియోగదారులు లింక్‌ను క్లిక్ చేస్తున్నారు. ఇంకేముంది ఫోన్ సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్లిపోతోంది. వారు వినియోగదారుల బ్యాంకు అకౌంట్‌లోని సొమ్మంతా కాజేస్తున్నారు. ఆలస్యంగా విషయం తెలుసుకుంటున్న బాధితులు ఆ తర్వాత విద్యుత్ శాఖ అధికారులు, పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు.

**జాగ్రత్త వహించాలి**

విద్యుత్ బిల్లులు చెల్లించలేదని ఏ విద్యుత్ అధికారి ఫోన్ చేయడు. కొన్ని సందర్భాల్లో స్థానిక లైన్‌మెన్ లేదా, విద్యుత్ సిబ్బంది డీలిస్ట్ (రెండు నెలలు బిల్లు చెల్లించని) వినియోగదారులుంటే వారికి ఫోన్ చేసి విషయం చెబుతారు. అప్పుడు కూడా ఎస్‌ఎంఎస్ ద్వారా లింక్ పంపి దానిపై క్లిక్ చేసి నగదు కట్టాలని చెప్పరు. బిల్లు చెల్లించాలని, ఈ నంబర్‌కు ఫోన్ చేయాలని మెసేజ్ వస్తే ఆందోళన చెందకుండా స్థానిక విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలి. వినియోగదారులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### అవగాహన కల్పిస్తాం




విద్యుత్ బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖకు చెందిన ఏ అధికారి ఫోన్ చేయడం కానీ, ఎస్‌ఎంఎస్ ద్వారా లింక్ పంపడం గానీ జరగదు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతిలో మా శాఖను వాడుకుని ప్రజలను మోసం చేస్తున్నారు. వినియోగదారులు జాగ్రత్త వహించాలి. ఈ విషయమై అవగాహన కలిగించాలని విద్యుత్ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం.

– విజయన్, ఎస్‌ఈ, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

• వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, వర్సిటీ సంయుక్తంగా హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల చాలా అనర్థాలు జరుగుతాయని చెప్పారు. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు, హెల్మెట్ ఉంటే ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి మాట్లాడుతూ బైక్‌పై రాకపోకలు సాగించే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందన్నారు. అది లేకుండా ప్రయాణం చేయడం మంచిదికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

### ఆటోను ఢీకొట్టిన లారీ
• ముగ్గురికి తీవ్రగాయాలు

కావలి: మండలంలోని అన్నగారిపాళెం సమీపంలో మంగళవారం ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు కథనం మేరకు.. ఆటోను లారీ ఢీకొనడంతో అన్నగారిపాళెం పంచాయతీలోని వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన ప్రళయకావేరి రమణయ్య, సోమేషు, ఆటో డ్రైవర్ చిరుతోటి జగన్ గాయపడ్డారు. క్షతగాత్రులకు కావలి ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని నెల్లూరుకు తరలించారు. సోమేషు, జగన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. జగన్‌ది కావలిలోని ఎస్సీ కాలనీ. దీంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలివచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.